# సుందరం జీవించాడు

వేదాంతం శ్రీపతి శర్మ

రోజూ ఎంతో కళకళలాడే కాలనీలోని పార్కు ఎందుకో చిన్నబోయింది. తప్పనిసరిగా కలుసుకునే నలుగురు పెద్దమనుషులు ఈ సాయంత్రం కూడా కలుసుకున్నారు. మామిడిచెట్టు కింద వున్న సిమెంట్ బెంచీ మీద కూర్చున్నారు. కానీ ఏ చడీ చప్పుడు లేదు. నిత్యానందం చేతులు కట్టుకుని అటూ ఇటూ చూస్తున్నాడు. పక్కన కూర్చున్న కృష్ణమూర్తి గొడుగు కర్ర మీద చేతులు పెట్టి దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. శ్యామలరావు మడతపెట్టిన చేతి సంచీని మరల మరల మడతలు పెడుతున్నాడు. రాంగోపాలం చేతులు రెండూ వెనక్కి వాల్చి ఎందుకో కళ్ళు మూసుకున్నాడు. ఎండుటాకులు గాలి తాకిడికి వాటి ఆటలో అవి వున్నాయి. చీకటి పడుతూ వుంది.

‘‘పాపం మంచివాడండీ’’ కృష్ణమూర్తి ఆ ఎండుటాకులు పగులుతున్న శబ్దంలో పలికాడు.

‘‘అయ్యో!’’ చివర్న వున్న రాంగోపాలానికి సరిగ్గా వినబడనట్లుంది.

‘‘సుందరం...’’ కృష్ణమూర్తి మరల అన్నాడు ‘‘సుందరం పాపం మంచివాడండీ. వెళ్లిపోయాడు!’’

• • •

సరిగ్గా నెలరోజులక్రితం ఇదే పార్కులో నలుగురు వృద్ధులు ఇలాగే కలుసుకున్నారు. కూరగాయలకని ఒకరు, మనవడిని ఆడించాలని ఒకరు, నడకకోసం ఒకరు, ఇంటిలో తింటున్న తిట్లని ఆ చెట్లచాట్లలో మనసులోంచి తీసి వదిలేద్దామని మరొకరు ఆ బెంచీ మీద ఒక్కొక్కరిగా కూర్చున్నారు. ఆ కబురూ ఈ కబురూ చెప్పుకున్నాక నిత్యానందం అన్నాడు–

‘‘ఇది విన్నారా?’’

‘‘ఏది?’’

‘‘సుందరం పని అయిపోయింది.’’

‘‘ఛా!’’

‘‘అవును’’ మెల్లగా చెప్పాడు నిత్యానందం ‘‘మొన్న శివయ్య షాపు వైపు వెళ్లాను. సుందరం కనబడడంలేదేమని అడిగాను. శివయ్య లెక్క పెట్టుకున్న డబ్బులు లోపల పెట్టి ‘ఏమయిందండీ, అంతా అయిపోయిందా?’ అన్నాడు.’’

హఠాత్తుగా బెంచీమీద నిశ్శబ్దం కమ్ముకుంది. కృష్ణమూర్తి ముందు అన్నాడు ‘‘ఏముందీ! ఎప్పుడూ ఏదో రోగం, బాధ, ఆసుపత్రి...మామూలేగా!’’

రాంగోపాలం ఆడిస్తున్న కాలును ఆపేశాడు. ‘‘ఊరు నిండా అప్పులే పాపం. అయ్యో ఇలా జరిగిందా!’’

శ్యామలరావు తొందరగా మాట జారడు.

‘‘ఏదోలెండి. అతని బ్రతుకు అతనిది. ఈసారి ఏమైంది? మామూలు ఆయాసమా లేక...’’ కృష్ణమూర్తి సగంలో ఆపాడు.

‘‘ఆ ఏముందండీ! ఈ కళలను నమ్ముకుంటే ఇంతే. ఏం మిగిలింది చూడండి. నాలుగురాళ్ళ బదులు నాలుగురోగాలు. పోన్లేండి. అతని కుటుంబం ఎలా వుందో!

ఇంతలో ఓ విచిత్రం జరిగింది. చీకటి పడుతున్న తరుణంలో వేళ్ళ మధ్య సిగరెట్‌ని నలుపుకుంటూ సుందరం మామూలుగా ప్రత్యక్షమయ్యాడు. నలుగురూ లేచి నిలబడ్డారు. సుందరానికి అర్థంకాలేదు. అప్పుడప్పుడు ఆ పార్క్‌వైపు వెళ్లినప్పుడు ఆ నలుగురూ సుందరాన్ని చూడగానే ఎంత నిట్టూర్చినా అతని కబుర్లు మటుకు మనసారా వినేవారు. అతని అనుకరణలు, నటనలోంచి వచ్చిన ఛలోక్తులు గమ్మత్తుగా వుండేవి. కానీ ఇలా నలుగురూ లేచి నిలబడడం సుందరానికి అర్థం కాలేదు.

‘‘ఏమైంది!’’ అడిగాడు.

నలుగురూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. అంతుపట్టని జీవన్మరణాలు ఇలా ఒకే క్షణంలో పక్కపక్కనే నిలబడడం వార్ధక్యంలో వున్న నలుగురికీ కొద్దిగా ఇబ్బందిగానే వుంది. నిదానంగా కూర్చున్నారు.

‘‘ఏం లేదు సుందరం!’’ కృష్ణమూర్తి చెప్పాడు ‘‘ఈ నిత్యానందం మమ్మల్ని కొద్దిగా కలవరపెట్టాడు. మొన్న మీ వీధి శివయ్య అతనికి తప్పుడు సమాచారం ఇచ్చాడుట!’’

‘‘ఏమి ఆ సమాచారం!’’ సుందరం కూడా ఆసనం గ్రహించాడు.

‘‘ఏముందీ! నిన్ను ఆసుపత్రికి పంపారని, అంతా అయిపోయిందనీ అన్నాడుట!’’

సుందరం విరగబడి నవ్వాడు.

‘‘నిజమే!’’ సిగరెట్ పడేసి చెప్పాడు ‘‘వాడికి నేను తిరిగి ఇవ్వలేని అప్పులటువంటివి మరి. ఇక తిరిగిరావు అని నిర్ధారించుకుని అలా వాగాడు వాడు. అయితే నేను ఆసుపత్రికి వెళ్లడం నిజమే!’’

‘‘ఇప్పుడు ఎలా ఉంది?’’

‘‘ఏమిటీ! భలేవారే. ఇంట్లో రోగిని. బయట ఓ రోగిని. ద్విపాత్రాభినయం మరి!’’

‘‘మంచివాడివే. అలా అనుకుంటే ఎలా!’’ శ్యామలరావు ఇక ఇంటికి వెళ్లడానికి లేచి నిలబడి అన్నాడు ‘‘కానీ ఒక్క విషయం సుందరం. ఈ నాటకాలూ, సీరియల్స్ వెంట ఎంతకాలం పడతావు? ఇంటి బాధ్యతలని ఎవరు చూసుకోవాలి!’’

మిగతా ముగ్గురూ నిలబడ్డారు.

‘‘నిజమే! చీకటిపడింది మరి, నడవండి. చూడు సుందరం! శ్యామలరావు అన్న మాట వాస్తవం. నటుడివి అయినంత మాత్రాన ఒక చేతిలో సిగరెట్ ఒక చేతిలో బాటిల్ వుండాలని లేదు. అయినా ఇంత వయసు వచ్చాక!’’ అన్నాడు కృష్ణమూర్తి.

సుందరం అతన్ని ఆపాడు ‘‘చూడు బాబాయ్! చీకటి గదిలో కూర్చున్నవాడికి ఎక్కడినుండో ఓ చిల్లులోంచి ఓ కిరణం కనిపిస్తుంది. వాడు దానినే చూస్తూ దాని కోసం రోజూ నిరీక్షిస్తాడు. యస్! ఒక జీవితకాలంలో అనంతాన్ని ఆస్వాదించే వెర్రిప్రయత్నం ఇది.’’

‘‘ఇదే నాకు నచ్చదు. పిచ్చి పిచ్చి వాగుడు వాగుతావు. అవునూ... కిందటి నెల రెండువేలు మరి ఏమైనట్లు!’’ కృష్ణమూర్తి గట్టిగా అన్నాడు.

సుందరం పార్కు గేటు దగ్గర ఆగాడు.

‘‘వడ్డీతోసహా నాకు నాలుగు లక్షలు రావాలి. వచ్చాక ఇచ్చేస్తాను.’’

నలుగురు ఒకళ్ల మొహాలొకరు చూసుకున్నారు.

‘‘సర్లే పదండ్రా! సుందరం! మరల కలుద్దాం!’’ అంటూ రోడ్డు దాటేసారు. సుందరం హుందాగా పక్కనే నడిచాడు.

‘‘నిత్యానందం! చూడు.. వార్తలు చదువుతున్నప్పుడు కాస్త వొళ్ళు దగ్గరుండాలి. సరేనా!’’ అన్నాడు రాంగోపాలం.

‘‘ఫర్వాలేదు’’ సుందరం నవ్వాడు.

‘‘నేను నిత్యానందానికి థాంక్స్ చెప్పాలి. రాకెట్‌ని పంపినట్లు నా జీవితాన్ని అతిశయోక్తిలోకి పంపాడు.’’

• • •

సుందరం నాకు కొద్దికాలంగా పరిచయం. ఎవరో టీవీ సీరియల్ తయారు చేస్తారని చెబితే యాభైవేలు ఇచ్చి నష్టపోయాడు. వెండితెరని ఏలేద్దామని కలలుకన్నాడు. ఒక నాటకంలో పాల్గొని నలుగురితో కూర్చుని ఏదో చెబుతూ ఉండగా నాకు తొలిసారి కనిపించాడు.

‘‘కానరాడు మంచివాడు కనీసం మంచివాడి వేషంలో’’ అతను చెబుతున్నాడు ‘‘కనిపించడు కరుణ రుణ మాత్రపు రూపంలో! వానరాదు, రానేరాదు సస్య శ్యామల దేశంలో...వినిపించదు వీణ తెగిన ప్రకోపంలో!’’

దగ్గరగా వెళ్లి కూర్చున్నాను.

''ఎవరిదండీ ఈ ఆలోచన?'' అడిగాను.

అతను వెంటనే చేతులు కలిపాడు.

''ఒకరు రాయాలా? కడుపు కాలగా కాలగా కడుపులోనే కాయిలా కాసే సంవాదాలూ, పసివాడి పలక మీద ఆఆలు ఒకరు రాయాలా సారూ, ఈ నుదుటి మీద కొన్ని చిన్ని గీతలు, కొన్ని పెద్ద గీతలు!''

అతను అప్పటికే మైకంలో వున్నాడు. అతనిన భుజం తట్టి లేచాను.

''మీ నటన బాగుంది. మీకు చక్కటి భవిష్యత్తు వుంది.''

అతను లేవబోయి తూలాడు. పక్కనవున్న వారు పట్టుకున్నారు. నాకు ఎందుకో చేతులు జోడించాడు. నేను వెనక్కి తిరిగాను.

అతనితో వున్నవారు ఎవరో అంటున్నారు ''సార్! వీడు డైలాగ్స్ ఒక్కసారి స్టేజీమీద స్వయంగా చెప్పేస్తాడు!''

ఒక్కసారి అతన్ని జాగ్రత్తగా చూసి వెళ్లిపోయాను.

ఆ తరువాత చాలాసార్లు నాటకాలు చూస్తున్నప్పుడు ప్రేక్షకుల్లో అతనూ ఉన్నాడు. ఒకటి రెండుసార్లు మా ఇంటికే వచ్చి పెట్టినది తిని నటన గురించి, నాటకం గురించి ఏవేవో చెప్పాడు.

''ఒక్క స్క్రిప్ట్ వ్రాయండి సార్'' ఒకసారి అన్నట్లు గుర్తు.

''నిజ జీవితంలో మేము చావనూలేము, బ్రతకనూలేము. ఒక స్టేజీ మీదైనా, స్టేజీలవారిగానైనా, ఒక శవంలోనైనా జీవించేయాలని వుంటుంది.''

కలం పట్టుకున్నప్పుడల్లా అతను, అతని మాసిన గడ్డం, చేతిలో సిగరెట్‌ముక్క, రైలు ఇంజను తాలూకు పొగ, అందులో తేలుతున్న ఊహ, ఒక స్వప్నంలాంటి మబ్బుల్లో కరిగిపోతున్న అతని ఆకారం, ఎందుకో మనసులో ఓ కలకలం సృష్టిస్తాయి.

● ● ●

రాత్రి బాగా పొద్దుపోయింది. గేటు దగ్గర నన్ను ఎవరో పిలుస్తున్నట్లనిపించింది. మాట స్పష్టంగాలేదు. కుక్కలు మొరుగుతున్నాయి. తలుపు తెరిచి గేటు దగ్గరికి వెళ్లాను. సుందరం గేటు మీద వాలి వున్నాడు. ఎక్కడో సంపాదించిన బాటిల్ ఒకటి చేతిలో వ్రేలాడుతోంది.

''సారూ! అర్జంట్‌గా బండి తీయండి!''

''ఎందుకు?''

''నన్ను జూబిలీహిల్స్‌కు తీసుకువెళ్లండి. ఫాస్ట్!''

గేటు తెరిచి లోపలికి తీసుకెళ్లబోయాను. అతను విదిలించుకున్నాడు.

''నే...సారూ! వాడో నేనో తేల్చేద్దాం. యాభైవేలు ఇవతలికి తీస్తాను. వడ్డీ వదిలేద్దాం పోనీ. రండి. పెట్రోల్‌కి డబ్బు నేనిస్తాను.''

అలా మాట్లాడుతూనే తూలిపోయాడు. బండి తీసి అతన్ని ఇంటికి తీసుకెళ్లి దింపాను. నేను బయలుదేరుతున్నప్పుడు అతనికి మరల స్పృహ వచ్చింది.

''సారూ! ఇవి నాకు మామూలే. నేను చావను. కళాకారుడు రోజూ పుడతాడు. వీడికి చావులేదు.''

నేను బండి స్టార్ట్ చేస్తుండగా మరల అడిగాడు–

''సారూ! నా స్క్రిప్ట్ ఏమైంది? నన్ను స్టేజీమీద చంపేయ్యండి. నా చుట్టూ వున్న చితుకుల లాంటి మనుషుల తోపాటు నేనూ కాలిపోతాను.''

నేను అక్కడినుండి వచ్చేసాను. కొద్దిరోజుల తరువాత సుందరం ఆరోగ్యం మరికాస్త క్షీణించింది. మరల ఆసుపత్రిలో చేరాడు. ఈసారి ఎందుకో డాక్టర్లకి వింతగా తోచింది. ఎప్పటిలాగా ఈసారి సుందరం వాళ్లతో సహకరించలేదు. జీవితాన్ని కొనసాగించాలనే ఆలోచన అతనిలో సడలింది.

ఎండ తీవ్రం కాకముందే చిన్నగా సుందరం ఇంటి ముందు జనం గుమిగూడారు. యాత్ర బయలుదేరింది. శ్మశానం దగ్గర వేరే గుంపు ఒకటి వుంది. ఒక చలనచిత్రం తాలూకు షూటింగ్ అక్కడ జరుగుతోంది. డైరెక్టర్ ఒక దహనం సీను చిత్రీకరిస్తున్నాడు. ఈ గుంపును చూసి ఆగిపోయాడు. వీళ్ళ కార్యక్రమాన్నే సజీవంగా కొద్దిగా దూరంగా వుండి కెమెరాలో బంధించేసి వెళ్లిపోయారు సినీ యూనిట్‌వారు. సుందరం తెలియకుండానే తెరమీదకి వెళ్లిపోయాడు.

''జీవితానికి చాలా దగ్గరగా రాసుకుని జీవించేందుకు నాలుగు మాటలు రాసుకుని తెర వెనుక ఆవుపాలవంటి భావాలను పొదిగించి, కృషించి అర నిముషంలో కనుమరుగైపోయే కళాకారులం. ఏదీ మాకు పోషణ ఏది?'' సుందరం ఏనాడో అన్న మాటలు మరల మరల వినిపించాయి. స్టేజీమీద అతన్ని చంపేసే పాత్ర సృష్టించే అవసరం నిజంగానే లేదు. అతను జీవించేశాడు!



● ● ●

కళకళలాడే కాలనీలోని పార్కు ఎందుకో చిన్నబోయింది. తప్పనిసరిగా కలుసుకునే నలుగురు పెద్దమనుషులూ ఈ సాయంత్రం కూడా కలుసుకున్నారు. ఎండుటాకులు గాలి తాకిడికి వాటి ఆటలో అవి వున్నాయి. కొద్దిరోజుల క్రితం సుందరానికి వాళ్ళు బ్రతికుండానే చితి తయారుచేసారు. అందువలనే కాబోలు ఈ సాయంత్రం ఎంతో నిశ్శబ్దంగా వున్నారు. బెంచీ మీద ఏ చప్పుడూలేదు. చీకటి పడుతూ వుంది.

''పాపం మంచివాడండీ!'' కృష్ణమూర్తి పలికాడు.

''అయ్యో!''

''సుందరం'' మరల అన్నారాయన... ''సుందరం పాపం మంచివాడండీ!''

★